క్లుప్తంగా

ఆంజనేయ ట్రేడర్స్ ప్రారంభం



షాపును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: పందలపాక గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆంజనేయ ట్రేడర్స్‌ను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వ్యాపార అధినేతలైన గండి వాసు, గొర్రెపల్లి మలేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలోని మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పోతుల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐగా సత్యకిషోర్



మధురపూడి: కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా వై.సత్యకిషోర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన భీమవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గంజాయి రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు, మహిళల భద్రతకు చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఆకతాయిలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఆయనకు కోరుకొండ ఎస్సై ఆనంద కుమార్, గోకవరం ఎస్సై పవన్ కుమార్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు



జ్యోతి వెలిగిస్తున్న ప్రముఖులు

రాజానగరం: కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలను అందుకుంటారని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ విద్యార్థులకు సూచించారు. గైట్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో గురువారం చైతన్య సదస్సు నిర్వహించారు. ఈర్ష, అసూయలకు దూరంగా పోటీతత్వంతో పయనిస్తే విజయాలు సిద్ధిస్తాయన్నారు. ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలనే తపనతో పాటు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. ప్రిన్సిపాల్ కె.వల్లీ మాధవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ విభాగాల అధిపతులు సీహెచ్. వెంకటేశ్వర్లు, కె.సత్యశ్రీహరి, డి.నాగేష్, మాధవి కామేశ్వరి పాల్గొన్నారు.

సంస్కృత భాషా వారోత్సవాలు



బీవీబీలో ఆకట్టుకున్న ప్రదర్శన

రాజానగరం: సంస్కృత భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని నామవరంలోని భారతీయ విద్యాభవన్‌లో గురువారం వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సంస్కృత భాషా వస్తు ప్రదర్శనను నిర్వహించారు. నిత్యావసరాలైన కూరగాయలు, ఫలాలు నుంచి మోటారు వాహనాల వరకు అనేక వస్తువులను ఈ ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు ఎంతో ఆసక్తితో వాటిని తిలకిస్తూ, సంస్కృతాన వాటి పేర్లను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొంతమంది విద్యార్థులు కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలను సంస్కృత భాషతోనే ప్రదర్శించడం అందరినీ ఆకట్టుకుంది.

మొక్కలు నాటిన ఉపాధి సిబ్బంది



సీతానగరంలో మొక్క నాటుతున్న ఎంపీడీవో రమేష్

సీతానగరం: తల్లి పేరుతో ఒక మొక్క (ప్లాంట్ ఫర్ మదర్) కార్యక్రమంలో భాగంగా మండల గ్రామాల్లో గురువారం ఉపాధి హామీ పథకం సిబ్బంది మొక్కలు నాటారు. సీతానగరంలోని చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద ఎంపీడీవో కె.రమేష్ కొబ్బరి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో నాగేషవేణి, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు చక్రవర్తి, వీరబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీను, శేఖర్, కృష్ణవేణి, ధర్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

మెళకువలే కీలకం

- పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి
- అప్రమత్తత చాలా అవసరం



పొలంలో పురుగుమందు పిచికారీ చేస్తున్న కూలీలు

బిక్కవోలు: వ్యవసాయంపై ఆధారపడి అనేక మంది జీవనం సాగిస్తున్నారు. రైతులు, కూలీలతో పాటు అనేక ఇతర రంగాలు దీనికి అనుసంధానమై ఉంటాయి. సాగు సమయంలో ఎరువులు, పురుగు మందులు చాలా కీలకంగా ఉంటాయి. అధిక దిగుబడులను సాధించడానికి ఇవి ఎంతో ఉపయోడపడతాయి. ఇదే సమయంలో పొలాల్లో పురుగు మందులు చల్లేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంది. బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో ఈ నెల 18వ తేదీన పొలంలో గుళికలు చల్లుతున్న తొమ్మిది మంది కూలీలు అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే 108 అనపర్తి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అదృష్టవశాత్తూ వారందరూ కోలుకున్నారు.

నకిలీల బెడద

రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. పంటల్లో చీడపీడల నియంత్రణ కోసం ఎరువులు, పరుగుల మందులు కొనుగోలు చేస్తుంటారు. ఇలాంటి సమయంలో జాగ్రత్తలు పాటించాలి. నకిలీల బెడద నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి. ఎరువులు కొనుగోలు, రసాయన పురుగు మందుల వాడకం, పిచికారీ సమయంలో వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు పాటించాలి. కాగా నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో 48 వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతోంది.

సూచనలు పాటించాలి

ప్రస్తుత సార్వా సీజన్‌లో వరిసాగు కుదుళ్ల దశలో ఉంది. ఇలాంటి సమయంలో వినియోగించే పురుగు మందుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఎరువుల దుకాణాల్లో మాత్రమే పురుగు మందులు కొనుగోలు చేయాలి. పురుగు మందుల డబ్బాలపై వజ్రాకారంలో పురుగుల మందుల స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరిత మందులైతే నీలం, తక్కువ విషపూరితమైతే ఆకుపచ్చ రంగుల గుర్తులు ఉంటాయి. వ్యవసాయ అధికారులు సూచించిన మందులను మాత్రమే పొలాలకు వినియోగించాలి. పంటలకు చీడపీడలు ఆశిస్తే అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వారి సూచనల మేరకు పిచికారీ చేయాలి.

జాగ్రత్తలు తప్పనిసరి

పురుగుమందుల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వాటి పిచికారీ విషయంలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలి.

- పురుగు మందులతో కలిపి ఆహార పదార్థాలను తీసుకువెళ్లకూడదు. ఇంట్లో మందులు నిల్వ ఉంచినప్పుడు ఆ గదికి తాళం వేయాలి. దాన్ని చిన్న పిల్లలకు అందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- మందులను పిచికారీ చేసేటప్పుడు తలకు, శరీరానికి రక్షణగా దుస్తులు, మాస్కులు ధరించాలి.
- ముందు డబ్బాలను ఆహార పదార్థాలు, తాగునీటిని నిల్వ చేసేందుకు వాడకూడదు.
- వరిచేలలో మందును పిచికారీ చేసేటప్పుడు గాలి వీచే దశలోనే నడవాలి. పిచికారీ చేసే సమయాల్లో ఆహారం తినకూడదు. ధూమపానం, మద్యపానం చేయకూడదు.
- స్ప్రే నాజిల్‌ను శుభ్రపరిచేందుకు నోటితో ఊదకూడదు. అనుకోకుండా శరీరం, దుస్తులపై మందు పడితే వెంటనే శుభ్రం చేసుకోవాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మందుల పిచికారీ చేయాలి. ప్రమాదవశాత్తు విష ప్రభావానికి గురైతే వెంటనే ప్రథమ చికిత్స చేసే వైద్యుడి వద్దకు వెళ్లి, మందుల డబ్బా వివరాల పత్రాన్ని చూపించి వైద్యం చేయించుకోవాలి. వాడేసిన ఖాళీ డబ్బాలను భూమిలో పాతిపెట్టాలి.

సలహాలు పాటించాలి



వరిచేలల్లో చీడపీడల నియంత్రణకు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను తప్పకుండా పాటించాలి. నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులను మాత్రమే వాడుకోవాలి. మందును పిచికారీ చేసే సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి.

– శామ్యూల్ జాన్, వ్యవసాయశాఖ ఏవో, బిక్కవోలు

ఆయిల్‌పామ్ సాగును విరివిగా చేపట్టాలి

రంగంపేట: ఆయిల్‌పామ్ సాగును రైతులు విరివిగా చేపట్టాలని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డీజీఎం డి.రవీంద్ర సూచించారు. మండల పరిధిలోని వీరంపాలెం గ్రామంలో పతంజలి ఫుడ్స్, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ సాగుద్వారా వచ్చే లాభం, మార్కెటింగ్ సౌలభ్యం, రైతులకు సకాలంలో చెల్లింపుల గురించి వివరించారు. ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.దుర్గేష్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటలకు బిందు సేద్యం పద్ధతిలో నీటిని అందించాలని అన్నారు. బిందు, తుంపర సేద్య పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తుందన్నారు. జిల్లా ఉద్యాన అధికారి బి.సుజాత కుమారి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు మొదటి నాలుగు సంవత్సరాలకు హెక్టార్‌కు రూ.21 వేలను ఎరువులు నిమిత్తం ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం రైతు ఉద్దండ్రావు సత్యనారాయణ పొలంలో ఆయిల్‌పామ్ మొక్కను నాటారు. కార్యక్రమంలో జిల్లా ఆయిల్‌పామ్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీవీ సత్యనారాయణ, మండల ఉద్యాన అధికారి కె.దివ్యశ్రీ పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ

మధురపూడి: కోరుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు గురువారం బ్యాగులు పంపిణీ చేశారు. ఆర్‌జెడీ శారద చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామచంద్రరావు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

సీతానగరం: రఘుదేవపురంలో సారా విక్రయిస్తున్న అంచూరి వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేశామని ఏఎస్సై చక్రారెడ్డి తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారం మేరకు రఘుదేవపురం శెట్టిబలిజపేటలో సారా విక్రయిస్తున్న వెంకటేశ్వరరావును అరెస్ట్ చేసి, అతడి నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

సేంద్రియ సాగుతో అనేక ఉపయోగాలు

రాజమహేంద్రవరం రూరల్: సేంద్రియ సాగుతో రైతులకు అనేక ఉపయోగాలు కలుగుతాయని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. ఈ విధానంలో పండించిన ఉత్పత్తులను 126 దేశాలలో ఇండ్ గాప్ పొలంబడి ద్వారా రైతులు విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. మండలంలోని రాజవోలులో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డాట్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వరిని ఆశించే చీడ పీడలు, తెగుళ్లకు సంబంధించి రైతులకు సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నీమస్త్రం తయారీ, ఉపయోగించే విధానాలపై అవగాహన కల్పించారు. వరిని ఆశించే రసం పీల్చే పురుగు, పేను బంక, తామర పురుగు, ఎర్ర నల్లి, తెల్లదోమలను గుడ్డు దశలో నియంత్రించటానికి నీమస్త్రం సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పెదపూడి: ఉపాధి హామీ పథకంలో నిబంధనలను ఉల్లఘించే పనులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 17వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఉపాధి పనులు చేపట్టాలని, వారిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. కాకినాడ జిల్లా డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 2023 జనవరి 1 నుంచి 2024 మార్చి వరకూ మండలంలో 1,448 పనులు జరిగాయన్నారు. వీటికి సంబంధించి కూలీలకు వేతనంగా రూ.6,23,40,638, మెటీరియల్ వ్యయంగా రూ.1,57,66,024 ఖర్చుచేశారన్నారు. మొత్తం రూ.7,81,06,663 నిధులకు సామాజిక తనిఖీ చేపట్టారన్నారు. వాటిలో సుమారు రూ.5,84,832 దుర్వినియోగం జరగడంతో రికవరీ చేయాలని ఆదేశించామన్నారు. వీటిలో ప్రధానంగా చింతపల్లిలో రూ.1.99 లక్షలు, జి.మామిడాడ రూ.2 లక్షలు, పెదపూడిలో 1.32 లక్షలు దుర్వినియోగం జరిగినట్లు బయట పడిందన్నారు. ముందుగా ఎస్‌ఆర్‌పీ పంతం సింహాద్రి అధ్వర్యంలో డీఆర్‌పీలు చేసిన తనిఖీ నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో కాకినాడ క్లస్టర్ ఏపీడీ వసంత మాధవి, ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి ప్రసాదరావు, ఏపీఓ సత్యనారాయణ, ఎంపీడీవో ఎం.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అచ్యుతాపురం మృతులకు నివాళి

పెదపూడి: అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం ఎస్సీజెడ్‌లోని ఫార్మా కంపెనీలో జరిగిన దుర్ఘటనకు సంబంధించి యాజమాన్యంపై హత్యానేరం కేసు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం (ఏపీఆర్‌సీఎస్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వి.రాజబాబు అన్నారు. ఈ మేరకు పెదపూడి శివారు కైకవోలు సెంటర్‌లో గురువారం నిరసన తెలిపారు. ముందుగా మృతులకు నివాళులర్పించారు. రాజబాబు మాట్లాడుతూ ఈ దుర్ఘటనలో 17 మంది మృత్యువాత పడటం, 60 మంది క్షతగాత్రులు కావడం బాధాకరమన్నారు. నిరసనలో జిల్లా కమిటీ సభ్యుడు మడికి సత్యం, పారిశుధ్య కార్మిక సంఘం నాయకుడు బొచ్చ ఏసు, నాయకులు ఏ.బాబి, వి.సత్తిబాబు పాల్గొన్నారు.

మధురపూడి: అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ నాయకులు గుబ్బల ఆదినారాయణ, ఆర్.రాఘవులు, జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడుతూ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టక పోవడమే ప్రమాదానికి కారణమన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: 11 కేవీ ఫీడర్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో రఘుదేవపురంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుంది. రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం ఈ విషయం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పెదపూడి: అనపర్తి మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. అనపర్తి పోతవరం సబ్ స్టేషన్‌లోని 11 కేవీ ధరణికోట, 11 కేవీ సావరం ఫీడర్ల లైన్‌లో చెట్టుకొమ్మల తొలగింపు, మరమ్మతుల కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. అలాగే దుప్పలపూడి నుంచి సరఫరా అయ్యే 11 కేవీ మహేంద్రవాడ ఫీడర్ లైన్‌లో కొమ్మల తొలగింపు కోసం విద్యుత్ నిలిపివేయనున్నట్టు తెలిపారు. దీంతో అనపర్తిలోని ధరణికోట, పాత ఊరు, బాపనమ్మ గుడి ఏరియా, సావరం కాలనీ మహాలక్ష్మిపేట, సీడీఆర్ హాస్పిటల్ ఏరియా, మార్కెట్ ఏరియా, మెయిన్ రోడ్, కెనాల్ రోడ్, కేఎల్ఎస్ పురం, కొప్పవరం గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తారన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో జెస్సీఫ్లోరెన్స్

బిక్కవోలు: మానవ అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీవో ఎ.జెస్సీఫ్లోరెన్స్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా ఉందన్నారు. ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీని బారిన పడుతున్నారన్నారు. ఉద్యోగం, సినిమా అవకాశాల పేరుతో వారిని మోసం చేసి విదేశాలకు విక్రయిస్తున్నారన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ 28 ఏళ్లుగా డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారుల సమన్వయంతో ఇప్పటి వరకు 28,200 మంది అమ్మాయిలు, మహిళలను కాపాడి పునరావాసం కల్పించిందన్నారు. ఎంపీడీఓ ఝాన్సీ మాట్లాడుతూ సెల్ ఫోన్, ఇంటర్నెట్ ద్వారా యువతులు సైబర్ ట్రాఫింగ్‌కు గురవుతున్నారన్నారు. సమావేశంలో ప్రజ్వల ఎన్‌జీవో కోఆర్డినేటర్ శ్రావ్య శృతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు శాంతి రత్న కుమారి, పద్మావతి, కృష్ణ కుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి గ్రామసభలు



బూరుగుపూడిలో గ్రామసభ పోస్టర్‌ను అతికిస్తున్న పంచాయతీ సిబ్బంది

మధురపూడి: కోరుకొండ మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉపాధి హామీ సభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ సభలు ప్రారంభమవుతాయన్నారు. గ్రామాలలో చేపట్టాల్సిన ఉపాధి పనులను గుర్తించి, తీర్మానం చేసి కలెక్టర్ పంపిస్తారన్నారు. దీనిలో భాగంగా ప్రతి సచివాలయానికి చెందిన కార్యదర్శి, సిబ్బంది ప్రధాన కూడళ్లు, జన సంచార ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఈ సభల సమాచారం ఉంచినట్టు తెలిపారు.

బిక్కవోలు: మండలంలో శుక్రవారం ఉపాధి పనులపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు. ఉదయం 11 గంటలకు బిక్కవోలు, బలభద్రపురం, ఇలపల్లి, కాపవరం, కొంకుదురు, మోళ్లూరు, పందలపాక, ఆర్ఎస్ పేట, రంగాపురం, తొస్సిపూడి, ఊలపల్లిల్లో జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అరికరేవుల, కొమరిపాలెంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

రంగంపేట: ఉపాధి హామీ పథకంపై ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు మండల అభివృద్ధి అధికారి పి.వెంకటరత్నం తెలిపారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఉపాధి కూలీలు, ప్రజల సమక్షంలో 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న కొత్త పనులపై తీర్మానం చేస్తారన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరి రాధిక తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: కోల్‌కతాలో వైద్యురాలిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరి రాధిక డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కోల్‌కతా ఘటనను దేశమంతా తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న వైద్యురాలు.. ఇలా మృతి చెందడం దారుణమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఆందోళనలో వైఎస్ శ్యామల, డి.కుమారీదేవి, కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య సంఘటనను ఖండిస్తూ ఈస్ట్ గోదావరి జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యాన గురువారం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. యూనియన్ సెక్రటరీ లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలకు తగిన రక్షణ కల్పించి, వారు స్వేచ్ఛగా తిరిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

కంబాలచెరువు: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్యకు పాల్పడిన దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఆ ఘటనను నిరసిస్తూ రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. న్యాయవాదులందరూ ప్లకార్డులు చేతపట్టుకుని జిల్లా న్యాయస్థానం బయట ప్రదర్శన చేపట్టారు. వీరేంద్రనాథ్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వమే దోషులకు సపోర్ట్ చేస్తూ ఆధారాలను మాఫీ చేసేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. ఈ ఘటనను హైకోర్టు, సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి ఎంక్వయిరీ చేపట్టడం హర్షణీయమన్నారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నాగదేవర స్వర్ణ పాప మాట్లాడుతూ సమాజంలో మహిళలపై దాడులు ఎక్కువవుతున్నాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పెళ్లూరి రమేష్, ట్రెజరర్ కర్ర హనుమంతరావు, జాయింట్ సెక్రటరీ ధర్నాలకోట వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ కాశీ శ్రీనివాసరావు, మహిళా సభ్యురాలు పద్మిని, సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు



పరిమితికి మించి ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు

సీటీఆర్ఐ: అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో స్కూల్ పిల్లలను తీసుకుని వెళ్లే ఆటోడ్రైవర్లు నిబంధలను ఉల్లంఘిస్తున్నారు. ఆటోలలో పరిమితికి మించి విద్యార్థులను తీసుకువెళుతున్నారు. ఒక్కో విద్యార్థినిని పాఠశాలకు తీసుకు వెళ్లడానికి వారి తల్లిదండ్రుల నుంచి నెలకు కొంత మొత్తం వసూలు చేస్తారు. కానీ పరిమితిని మించి పిల్లలను తీసుకువెళ్లడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అదనంగా వచ్చే డబ్బులకు ఆశపడి ఒకే ఆటోలో పది మందికి పైగా విద్యార్థులను ఎక్కించుకుంటున్నారు. ఆటోలో ఆరుగురు, వెనక వైపు డోర్‌పై మరో నలుగురిని కూర్చొబెడుతున్నారు. డోర్‌కి ఉన్న ఇనుప గొలుసు తెగిపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. నగరంలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఈ విధంగా విద్యార్థులను తీసుకు వెళుతున్న ఆటోలు దర్శనమిస్తున్నాయి. స్థానిక నాగరాజ మున్సిపల్ స్కూల్‌కి విద్యార్థినులు ఇలా ఆటో వస్తూ కనిపించారు.

రోగులకు పండ్ల పంపిణీ

పెదపూడి: సినీనటుడు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా పెదపూడి సామాజిక ఆరోగ్యకేంద్రంలో ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముందుగా మొక్కను నాటారు.

అప్రమత్తతే ఆరోగ్యానికి రక్ష

- స్పర్శ లేని మచ్చలలో ప్రమాదం
- అంగవైకల్యానికి గురయ్యే అవకాశం
- కుష్టువ్యాధి నివారణకు చర్యలు
- వైద్య, ఆరోగ్యశాఖ విస్తృత సర్వే



కుష్టువ్యాధి సర్వే నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

కంబాలచెరువు: ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు చెబుతారు. మనిషికి ఆరోగ్యమే అసలైన సంపద అని దాని అర్థం. నేడు అనేక రకాల రోగాలు మనపై దాడి చేస్తున్నాయి. దానికి కారణాలు ఏమైనప్పటికీ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి. రోగాల నుంచి ప్రజలను కాపాడటానికి వైద్య, ఆరోగ్య శాఖ అనేక చర్యలు చేపడుతోంది. దానికి ప్రజలు సహకరిస్తే చాలు. వైద్య సిబ్బంది ఇటీవల కుష్టు వ్యాధి సర్వేను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటింటికి వైద్య సిబ్బంది వెళ్లి ప్రజలను సర్వే చేస్తున్నారు. శరీరంపై అనుమానాస్పద మచ్చలు ఉంటే గుర్తించి, వైద్య చికిత్స అందిస్తున్నారు. కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా ఈ కార్యక్రమం అన్నిచోట్లా జరుగుతోంది.

స్పర్శలేని మచ్చలుంటే..

శరీరంపై ఉండే మచ్చలలో స్పర్శ లేకుండా ఉన్నవి ప్రమాదకరం. వీటి వల్ల కుష్టు వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. ప్రాథమిక దశలోనే అలాంటి మచ్చలను గుర్తిస్తే చికిత్స తీసుకుని, సమస్య నుంచి బయటపడవచ్చు. కుష్టు మాట వింటేనే ఒకసారిగా గుండెల్లో ఏదో తెలియని భయం. ఈ వ్యాధి నిర్మూలనకు, ప్రజల్లో అవగాహనకు, కుష్టు రహిత సమాజాన్ని నిర్మించేందుకు వైద్య ఆరోగ్య శాఖ కృషి చేస్తోంది.

విస్తృతంగా సర్వే

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ పేరుతో రాజమహేంద్రవరంలో వ్యాధిగ్రస్తులను గుర్తించే చర్యలు చేపట్టారు. అనుమానిత కేసులను గుర్తించే పనిలో వైద్యసిబ్బంది బిజీగా మారారు. ఇంటింటికీ తిరిగి అనుమానిత మచ్చలున్న వారిని గుర్తిస్తున్నారు. అలాగే బ్యానర్లు, పోస్టర్లు, పాంపెట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కుష్టువ్యాధి వల్ల కలిగే అనర్థాలను వివరించి, దానిని గుర్తించడం వల్ల కలిగే ముందస్తు ప్రయోజనాలను ర్యాలీల ద్వారా తెలియజేస్తున్నారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సుమారు నాలుగు లక్షల మందిని వైద్య సిబ్బంది సర్వే చేశారు. వారిలో ఇప్పటివరకు కుష్టు వ్యాధి సోకిన పదిమందిని గుర్తించారు.

లక్షణాలు ఇవీ..

- చర్మంపై స్పర్శ, నొప్పి, దురద లేని మచ్చలు
- చర్మంపై ఎరుపు, రాగి రంగు మచ్చలు
- చెవులు, వీపు, ఛాతీపై బొడిపెలు
- కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం, కంటి రెప్పలు, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం
- నరాల నొప్పి, చేతులు, పాదాలు, నరాల తిమ్మిర్లు
- అరచేతులు, పాదాలలో స్పర్శ కోల్పోవడం, పొడిబారడం, నొప్పి, పుండ్లు ఏర్పడడం, చేతి, కాళ్ల వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం ఏర్పడడం
- కాళ్ల నుంచి చెప్పులు, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- మణికట్టు, మడమను పైకి లేపలేకపోవడం
- చల్లని, వేడి వస్తువులను తాకినా గుర్తించలేక పోవడం